సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 5 | మే | 2023



పంపకాల్లో తేడాలు!

ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలల్లో డిప్యూటేషన్ల వివాదం ముదురుతోంది. పలువురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 8లో



ప్రత్యేక శ్రద్ధతో..

ప్రత్యేక శ్రద్ధతో గ్రామపంచాయతీల్లో సమస్యలు పరిష్కరించాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులు సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 25°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం వాతావరణం చల్లగా ఉంటుంది. అక్కడక్కడా చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

చుంచుపల్లి: జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 6న జిల్లా ప్రజా పరిషత్ హాల్‌లో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ఎం.విద్యాలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సమావేశాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

దరఖాస్తు గడువు పెంపు

చుంచుపల్లి: జిల్లాలోని రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో ఖాళీగా ఉన్న మూడు మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తు స్వీకరణ గడువును ఈ నెల 7 వరకు పొడిగించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్.జేవీఎల్ శిరీష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీబీఎస్, బీఏఎంఎస్ అర్హత కలిగివారు దరఖాస్తు చేసుకోవాలని, మూడు పోస్టుల్లో రెండు పురుషులకు, ఒకటి మహిళకు కేటాయించినట్లు పేర్కొన్నారు. అర్హతలు కలిగిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యతను ఇస్తామని, అనంతరం ఆయుష్ అర్హత కలిగిన వారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఒప్పంద పద్ధతిలో నియామకం చేపడతామని, నెలకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు వేతనం ఉంటుందని, ఇతర వివరాలకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సంప్రదించాలని వివరించారు.

డీఎంహెచ్‌ఓ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న జేవీఎల్ శిరీష

సుజాతనగర్: మండల పరిధిలోని సర్వారం గ్రామంలో ఉన్న ఆరోగ్య సంరక్షణ కేంద్రం(హెల్త్ వెల్‌నెస్ సెంటర్)లో డీఎంహెచ్‌ఓ జేవీఎల్ శిరీష గురువారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 10న ఎన్‌క్వాస్ బృందం ఆరోగ్య సంరక్షణా కేంద్రానికి పరిశీలన కోసం రానుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సుకృత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

7న 'ఏకలవ్య' ప్రవేశ పరీక్ష

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశానికి 7, 8, 9వ తరగతులలో ఖాళీల భర్తీకి ఈ నెల 7న పరీక్ష నిర్వహించనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్ రాజ్ తెలిపా రు. గురువారం తన చాంబర్ నుంచి పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లపై ప్రిన్సిపాల్స్‌తో నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

13న ఓపెన్ ఇంటర్ ఎకనామిక్స్ పరీక్ష

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 13న ఓపెన్ ఇంటర్మీడియట్ ఎకనామిక్స్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈనెల 2న ఎకనామిక్స్ పరీక్ష రోజున ఒక పేపర్‌కు బదులు మరో పేపర్ ఇవ్వడంతో పరీక్ష రద్దు చేశారు. ఓపెన్ ఇంటర్ పరీక్షలు గురువారంతో ముగియాల్సి ఉండగా, రద్దైన పరీక్షను ఈ నెల 13 నిర్వహించనున్నారు.

కార్మికుడి భార్య ప్రాణాల మీదకు కారుణ్య దందా

దళారీ మాటలు నమ్మి మోసపోయి ఆత్మహత్యాయత్నం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కారుణ్య నియామకాల దందా ఓ కార్మికుడి భార్య ప్రాణాల మీదకు వచ్చింది. నాలుగేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న సింగరేణి కొత్తగూడెం ఏరియాకు చెందిన ఓ ఉద్యోగి మెడికల్ ఇన్వాలిడేషన్(అన్‌ఫిట్) కోసం దరఖాస్తు చేసుకున్నాడు. మెడికల్ బోర్డు లీకేజీల ద్వారా విషయం తెలుసుకున్న ఓ దళారీ సదరు కార్మికుడిని నమ్మించి ఫార్మాలిటీస్ అంటూ రూ. లక్షలు వసూలు చేశాడు. దీంతో కార్మికుడి కుటుంబం వడ్డీలకు అప్పు తెచ్చి డబ్బులు ముట్టజెప్పింది. మొత్తం డబ్బులు సకాలంలో చెల్లించలేకపోవడంతో కార్మికుడు అన్‌ఫిట్ కాలేదు. మళ్లీ రంగ ప్రవేశం చేసిన దళారీ ఇకపై డ్యూటీ చేయొద్దని తప్పుడు సలహా ఇవ్వడమే కాకుండా మిగిలిన డబ్బులు రెడీ చేసుకుంటే ఈ సారి పనై పోతుందంటూ నమ్మబలికాడు. కానీ ఇటీవల జరిగిన మెడికల్ బోర్డులోనూ కార్మికుడు అన్‌ఫిట్ కాలేదు. ఏడు నెలలుగా విధులకు హాజరుకాకపోవడం, మరోవైపు తెచ్చిన అప్పులకు వేలాది రూపాయలు వడ్డీలు చెల్లించాల్సి రావడం, కారుణ్యంలో వారసుడికి భరోసా దక్కే అవకాశాలు కొడగట్టిపోవడంతో ఆ కుటుంబం నైరాశ్యంలో కూరుకుపోయింది. చివరకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో సదరు కార్మికుడి భార్య గురువారం రాత్రి ఆత్మహత్యకు యత్నించింది. 48 గంటలు గడిస్తేకానీ ఏ విషయం చెప్పలేమని వైద్యులు చెబుతుండగా, విషయం బయటకు చెబితే ఎక్కడ ఇబ్బంది వస్తుందోనని కుటుంబీకులు మనోవేదనకు గురవుతున్నారు. అయితే పోలీసులు విచారణ ప్రారంభించినట్లు సమాచారం.

భూ మాయ!



పాల్వంచలో 4 వేల ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి

- గత నలభై ఏళ్లలో వందలాది ఎకరాలు అన్యాక్రాంతం
- రెవెన్యూ రికార్డుల్లోనూ స్థలాలపై కానరాని స్పష్టత
- అస్పష్టత ఆధారంగా ఆక్రమణకు ఓ నేత యత్నం
- ప్రభుత్వ స్థలాల మాయంపై లోకాయుక్త విచారణ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కేంద్రంలో భాగంగా ఉన్న పాల్వంచలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైంది. 1500 ఎకరాలకు పైగా ప్రభుత్వ స్థలం కేవలం రెవెన్యూ రికార్డుల్లోనే కనిపిస్తోంది. ఈ స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలు అందివ్వాలంటూ లోకాయుక్తలో ఫిర్యాదులు అందాయి.

పాల్వంచలో రెండు రకాల భూమి..

ప్రస్తుత పాల్వంచ పట్టణంలో రెండు రకాల భూమి ఉంది. ఇందులో సర్వే నంబరు 1 నుంచి 137 వరకు పాల్వంచ గ్రామ పరిధిలో ఉండగా, సర్వే నంబరు 138 నుంచి 999 వరకు పాల్వంచ సంస్థానం పరిధిలో ఉంది. ఈ మొత్తం స్థలంలో 444, 817, 999 సర్వే నంబర్లలో ఉన్న వేలాది ఎకరాలు పూర్తిగా ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డులు పేర్కొంటున్నాయి. 1958 రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబరు 999లో ఏకంగా 4,169 ఎకరాల స్థలం ఉన్నట్టుగా తేలింది.. ఇందులో ఫారెస్టు శాఖ పరిధిలో 1,153 ఎకరాల ఉంది. కాగా 1958లో ఈ 999 సర్వేలో 863 ఎకరాల భూమిని దళిత గిరిజనులకు అప్పటి ప్రభుత్వం కేటాయించినట్టు రెవెన్యూ రికార్డులు పేర్కొంటున్నాయి. ఈ సర్వేలో అసైన్డ్, ఫారెస్టు శాఖ పరిధిలో ఉన్న స్థలాన్ని మినహాయిస్తే ఇంకా 2,026 ఎకరాల ప్రభుత్వం స్థలం ఇప్పటికీ మిగిలి ఉండాలి.

రెవెన్యూ రికార్డుల్లో..

కిన్నెరసాని ప్రాజెక్టు నిర్మాణం, కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ రాకతో 1970వ దశకం తర్వాత పాల్వంచ రూపురేఖలు మారిపోయాయి. సంస్థాన్ పాల్వంచ, పాల్వంచ రెవెన్యూ గ్రామాలు బాగా అభివృద్ధి చెందాయి. ఆ తర్వాత పాల్వంచ ఏకంగా మున్సిపాలిటీగా అభివృద్ధి చెందింది. సుమారు ఎనభై వేలకు పైగా జనాభా ఇక్కడ నివసిస్తున్నారు. పాల్వంచ గ్రామం నుంచి పట్టణంగా అభివృద్ధి చెందే క్రమంలో ప్రభుత్వ స్థలాల్లో కొందరు పేదలు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారు. కార్మికుల కోసం కాలనీలు కూడా వెలిశాయి. ఫలితంగా గడిచిన నాలుగు దశాబ్దాల కాలంలో సర్వే నంబరు 999లో 327 ఎకరాల స్థలం ఆక్రమణకు గురైంది. ఈ విషయాన్ని ప్రభుత్వ యంత్రాంగమే అధికారికంగా ధ్రువీకరించింది. దీంతోపాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు సైతం సర్వే నంబరు 999లో వంద నుంచి రెండు వందల ఎకరాల వరకు స్థలాన్ని కేటాయించినట్టు రికార్డులు చెబుతున్నాయి.

లోకాయుక్తలో ఫిర్యాదు

సర్వే నంబరు 999లో ఉన్న నాలుగువేలకు పైగా ఎకరాల స్థలంలో ఫారెస్టు, అసైన్డ్, ఆక్రమణలు, వివిధ ప్రభుత్వ కార్యాలయలకు కేటాయింపు అంతా కలిసి ఇంచుమించు 2500 ఎకరాల వరకు లెక్క తేలుతోంది. మిగిలిన 1500 ఎకరాల స్థలంపై ఈ రోజుకు స్పష్టత లేదు. దీంతో సర్వే నంబరు 999తో పాటు సర్వే నంబరు 444, 817లలో ఎంత ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందో పూర్తి వివరాలు ఇవ్వాలంటూ పాల్వంచకు చెందిన పానిశెట్టి వెంకటేశ్వర్లు పలు మార్లు రెవెన్యూ సిబ్బందిని సంప్రదించాడు. సదరు వివరాలు అందివ్వడంలో రెవెన్యూశాఖ విఫలం కావడంతో లోకాయుక్తను ఆశ్రయించారు. దీంతో సదరు సర్వే నంబర్లలో ఎంత ప్రభుత్వ భూమి ఉందో వివరాలను తెలపాలంటూ లోకాయుక్త జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ మేరకు ఈ ఏడాది జనవరిలో జిల్లా యంత్రాంగం తరఫున లోకాయుక్తకు సమర్పించిన వివరాల్లోనూ సర్వే నంబరు 999లో ఉండాల్సిన 1500 ఎకరాల స్థలంపై స్పష్టత కరువైంది.

రాజకీయ నేతల ఆక్రమణ

గిరిజనుల సంరక్షణ కోసం రూపొందించిన ప్రెసిడెన్షియల్ రూల్స్ కిందకు పాల్వంచ పట్టణం వస్తోంది. దీంతో మున్సిపాలిటీగా మారినా సరే పాల్వంచలో ఎన్నికలు నిర్వహించకుండా రాష్ట్రపతి ఆదేశాలను పాటిస్తూ వస్తున్నారు. అదే ఆదేశాల ప్రకారం ఈ ప్రాంతంలో గిరిజనులు – గిరిజనుల మధ్యనే క్రయవిక్రయాలు జరగాలి. ఇతరులు కొనుగోలు చేస్తే అవి చెల్లవు. సర్వే నంబరు 999లో ఉన్న గజిబిజి, గందరగోళాన్ని ఆధారంగా చేసుకుని పాల్వంచ పట్టణానికి చెందిన ఓ రాజకీయ నాయకుడి కుటుంబ సభ్యులు లేని రికార్డులు సృష్టించి సర్వే నంబరు 999లో వందల ఎకరాలు ఆక్రమించినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఆక్రమించిన భూములకు పట్టాలు మంజూరు చేయించేందుకు ప్రభుత్వ అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు సర్వే నంబర్లు 444, 817, 999లకు సంబంధించి తదుపరి విచారణను లోకాయుక్త 2023 జూలైలో కొనసాగించనుంది. ఈ లోగా ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా రాజకీయ నేతల చెర నుంచి విడిపించాలనే డిమాండ్లు వస్తున్నాయి.

త్వరలో ప్రత్యేక బృందంతో సర్వే చేస్తాం



సర్వే నంబర్ 999 విస్తీర్ణం 4,169 ఎకరాలు ఉంటుంది. ఇందులో ఫారెస్ట్ భూమి 1,153 ఎకరాలు,పాత పట్టా భూములు 980 ఎకరాలు ఉన్నది. 1300 ఎకరాలు అసైన్డ్‌మెంట్ చేశారు. కొంత భాగం ఇళ్లు, ఇళ్ల స్థలాలు కూడా ఉన్నాయి. ఈ సర్వే నంబర్‌ను సర్వే కోసం కలెక్టర్‌ను కోరాం. ప్రత్యేక టీం ద్వారా సర్వే చేస్తాం. ప్రభుత్వ భూముల ఆక్రమణ ఉన్నా, అసైన్డ్‌మెంట్ భూములు కొనుగోలు చేసినా ఆయా యాక్ట్‌ల ప్రకారం చర్యలు తీసుకుంటాం. తరతరాలుగా కొన్ని పట్టా భూములు వస్తున్నట్లు కూడా కొన్నింటిని గుర్తించాం. పాత పట్టాలను పరిగణనలోకి తీసుకుంటాం.

– రంగా ప్రసాద్, పాల్వంచ తహసీల్దార్

వైభవంగా శ్రీవారి కల్యాణం



కల్యాణ వేడుకలో అమ్మవారి మంగళసూత్రాలను భక్తులకు చూపిస్తున్న అర్చకుడు

- మార్మోగిన గోవింద నామస్మరణ
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

బూర్గంపాడు: కలియుగ దైవంగా భావించే శ్రీ వేంకటేశ్వర స్వామి తిరుమల తిరుపతి నుంచి తరలిరాగా భక్తులు జేజేలు పలికారు. ఆహ్లాదకర వాతావరణంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై గోవింద నామస్మరణ మార్మోగింది. గురువారం బూర్గంపాడు మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామం మరో వైకుంఠంగా మారింది. ఆధ్యాత్మిక వాతావరణంలో గోవిందుడి కల్యాణం కమనీయంగా జరిగింది.

హారతులతో ఘనస్వాగతం

టీటీడీ ఆధ్వర్యంలో ప్రచార రథంలో గురువారం ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులు గ్రామానికి చేరుకోగా, గ్రామస్తులు హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. కల్యాణానికి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. అన్నమయ్య కీర్తనలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ వేదికపై ఉత్సవమూర్తులను ఆశీనులు చేశారు. టీటీడీ నుంచి వచ్చిన అర్చకులు, పండితులు ప్రత్యేక పూజలతో కల్యాణాన్ని ప్రారంభించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనంతో హోమం జరిపారు. అనంతరం కల్యాణఘట్టాన్ని



స్వామివారి కల్యాణానికి తరలివచ్చిన భక్తులు

శాస్త్రోక్తంగా జరిపారు. అర్చకులు స్వామివారి కల్యాణ విశిష్టతను భక్తులు వివరించారు. స్వామివారి కల్యాణాన్ని వీక్షించేందుకు గ్రామ కల్యాణ ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొన్నది. బూర్గంపాడు, భద్రాచలం, అశ్వాపురం మండలాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఐటీసీ ఆధ్వర్యంలో సుమారు పది వేల మందికి అన్నదాన సౌకర్యం కల్పించారు. వేడుకల్లో బూర్గంపాడు జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, ఐటీసీ ఉన్నతాధికారులు శ్యాంకిరణ్, చెంగల్‌రావు, శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ బట్టా విజయ్‌గాంధీ, మాజీ ఎంపీపీ రోశిరెడ్డి, ప్రముఖులు పాకాల దుర్గాప్రసాద్, మారం వెంకటేశ్వరెడ్డి, హరిప్రసాద్, యారం పిచ్చిరెడ్డి, గోనె దారుగ, పలువురు ఎంపీపీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'పీఎం శ్రీ'కి 20 పాఠశాలలు ఎంపిక

- ఒక్కో పాఠశాలకు ఐదేళ్లలో రూ.2 కోట్ల నిధులు
- ఏటా రూ.40 లక్షల చొప్పున విడుదల

పాల్వంచరూరల్: ప్రభుత్వ విద్యాసంస్థల రూపురేఖలు మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎం–శ్రీ) పథకానికి జిల్లాలో 20 పాఠశాలలను ఎంపిక చేసినట్లు జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఏ.నాగరాజశేఖర్, సహాయ గణాంక అధికారి సతీష్‌కుమార్ తెలిపారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలో సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో గురువారం పీఎం శ్రీ పథకానికి ఎంపికైన 20 పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. బడ్జెట్ ప్రతిపాదనలు, పాఠశాలలో భౌతిక వనరుల అభివృద్ధికి కావాల్సిన ప్రతిపాదనలు ఆన్‌లైన్ ద్వారా సమర్పించే క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 20 పాఠశాలల ప్రతిపాదనలను తీసుకుని ఈ నెల 6న రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. విద్యార్థుల్లో సంపూర్ణ మూర్తిమత్వాన్ని పెంపొందించేందుకు కేంద్రం ఈ పథకం ప్రవేశపెట్టిందని చెప్పారు. ఎంపికైన పాఠశాలలకు సంవత్సరానికి రూ.40 లక్షల చొప్పున ఐదేళ్లపాటు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేస్తారని పేర్కొన్నారు. ఇందులో 60 శాతం నిధులు కేంద్రం, 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. పాఠశాలలకు సొంత భవనం, విద్యుత్ సౌకర్యం, క్రీడామైదానం, టాయిలెట్ల ఏర్పాటు, ఇంటరాక్టివ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ల్యాబ్స్ ఏర్పాటు, అదనపు తరగతి గదుల నిర్మాణం వంటి కార్యక్రమాలకు నిధులు వినియోగించవచ్చని చెప్పారు. 2023–2024 విద్యాసంవత్సరం నుంచి నిధులు వస్తాయని తెలిపారు.



మాట్లాడుతున్న సతీష్‌కుమార్

ఎంపికైన పాఠశాలలు ఇవే..

పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లిలో సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలికల ఉన్నత పాఠశాల, (అభ్యుదయ స్కూల్), టేకులపల్లిలోని టీడబ్ల్యూ ఆశ్రమ ఉన్నత పాఠశాల(కోయగూడెం), ఇల్లెందు మండలం సుదిమళ్లలోని టీఎస్ డబ్ల్యూ ఆర్‌ఈఐఎస్(బాలికల పాఠశాల), పినపాక మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి, టీడబ్ల్యూ ఆశ్రమ ఉన్నత పాఠశాల, ములకలపల్లిలోని టీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్, మణుగూరులోని టీటీడబ్ల్యూయూఆర్‌జేసీ బాలికల పాఠశాల, లక్ష్మీదేవిపల్లి మండలంలోని హేమచంద్రాపురం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల, అన్నపురెడ్డిపల్లిలో టీఎస్ డబ్ల్యూఆర్‌ఈఐఎస్, అశ్వాపురంలో జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల, అశ్వారావుపేటలోని నారావారిగూడెం ఎంపీపీఎస్ పాఠశాల, భద్రాచలంలో కొత్తరాజులగుట్ట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల, బూర్గంపాడులోని సారపాక జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల, చండ్రుగొండలోని అయ్యన్నపాలెం ఎంపీపీఎస్ పాఠశాల, చుంచుపల్లి మండలం బాబుక్యాంప్‌లోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల, దమ్మపేటలోని టీడబ్ల్యూ ఆర్‌ఈఐఎస్ పాఠశాల, దుమ్ముగూడెంలోని కె.రేగుబల్లిలో టీడబ్ల్యూ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, గుండాల టీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ పాఠశాల, జూలూరుపాడులోని పాలకొల్లులో జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల, కొత్తగూడెంలోని కూలీలైన్ ప్రభుత్వ పా ఠశాల పీఎం శ్రీకి ఎంపికైనట్లు అధికారులు తెలిపారు.

పొంగులేటి చూపు.. ఎటువైపు?!

ఏ పార్టీలో చేరతారనే అంశంపై ఉత్కంఠ

- ఇప్పటికే చర్చలు జరిపిన కాంగ్రెస్ నేతలు
- తాజాగా బీజేపీ బృందం భేటీతో జోరందుకున్న చర్చలు



చర్చల అనంతరం మాట్లాడుతున్న మాజీ ఎంపీ శ్రీనివాసరెడ్డి, పక్కన కోరం కనకయ్య తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏ పార్టీలో చేరుతారనేది ఉమ్మడి జిల్లాలోని ఆయన అనుచరులతోపాటు రాజకీయంగా ఉత్కంఠ రేపుతోంది. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ నేతలు ఆయనతో చర్చలు జరిపారు. ఈ నెలాఖరు వరకు ఏ పార్టీలో చేరే అంశం తేలనుండడంతో ఆయన నిర్ణయంపై అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సహా ఆ పార్టీ ముఖ్యనేతలు ఐదుగురు గురువారం పొంగులేటిని ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో కలిసి సుదీర్ఘంగా చర్చించారు. పొంగులేటితోపాటు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు వచ్చిన బీజేపీ నేతలకు పొంగులేటితోపాటు ఆయన అనుచర నేతలు స్వాగతం పలికారు. భోజనం చేశాక చర్చలు జరిపిన వారు సాయంత్రం 6.30 గంటలకు తిరిగి హైదరాబాద్ బయలుదేరారు. ఈ మొత్తం చర్చల్లో బీజేపీలో చేరతారా, లేదా అనేది స్పష్టత రాకున్నా... పొంగులేటి నిర్ణయం ఈనెలాఖరుకు తేలే అవకాశముందని తెలుస్తోంది.

ఇప్పటికే మాట్లాడిన రేవంత్‌రెడ్డి

ఈ ఏడాది జనవరి మొదట్లో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీఆర్‌ఎస్ పార్టీపై తిరుగుబాటు జెండా ఎగురవేయగా, అప్పటినుంచి ఆయన ఏ పార్టీలో చేరాలనే అంశంపై అంతర్గత చర్చలు కొనసాగిస్తున్నారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితోపాటు ముఖ్యనేతలు పొంగులేటితో చర్చించారు. కాంగ్రెస్ పార్టీలో చేరితే తగిన ప్రాధాన్యత ఇస్తామని చెప్పినట్లు తెలిసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆది నుంచి కాంగ్రెస్ ప్రాతినిధ్యం ఎక్కువగా ఉండడం, వచ్చే ఎన్నికల్లోనూ బలంగా ఉంటుందని టీపీసీసీ బృందం ఆయనకు చెప్పినట్లు సమాచారం. ఆయన పార్టీలో చేరితే ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ సత్తా చాటొచ్చని ప్రతిపాదించినా.. ఆయన ఏ నిర్ణయం చెప్పలేదని తెలిసింది. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఆయన అనుచర నేతలు కూడా అంతర్గత సర్వేల ఆధారంగా కాంగ్రెస్ పార్టీలో చేరాలని కోరినట్లు సమాచారం.

బీజేపీ కమిటీ రాకతో కాక

ఈటల నేతృత్వంలోని బీజేపీ చేరికల కమిటీ నేరుగా పొంగులేటి క్యాంప్ కార్యాలయానికి వచ్చి ఆయనతోపాటు జూపల్లితో సుదీర్ఘంగా చర్చించడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రాజకీయాలు వేడెక్కాయి. పార్టీ అధినేతలు అమిత్‌షా, నడ్డా సూచనల మేరకే తాము పొంగులేటితో చర్చలకు వచ్చినట్లు ఈటల ప్రకటించడంతో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల తాజా రాజకీయ పరిస్థితులను ఇరువురు నేతలు ఈటల ముందు ప్రస్తావించారు. కేసీఆర్‌ను గద్దె దించే లక్ష్యం కలిగిన బలమైన శక్తులతోనే తమ ప్రయాణం ఉంటుందని వీరిద్దరు చెప్పినట్లు తెలిసింది. ఇదే సమయాన ఆయన కూడా రాష్ట్రంలో బీజేపీ బలపడుతుండడం, దేశంలో రాజకీయ పరిస్థితులను వివరించి పార్టీలో చేరాలని ఆహ్వానించారని సమాచారం. ఇదిలా ఉండగా పొంగులేటితో చర్చించిన అంశాలను ఈటల బృందం రెండు, మూడు రోజుల్లో ఢిల్లీలో బీజేపీ పెద్దలను కలిసి వివరించనున్నట్లు తెలిసింది. ఆ తర్వాత మరోదఫా పొంగులేటిని ఈటల కలిసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

అనుచర నేతల్లో ఉత్కంఠ

పొంగులేటిని బీజేపీ చేరికల బృందం కలవడంపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరగణంలో జోరుగా చర్చ సాగుతోంది. ఈటల వస్తున్నారనే సమాచారంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనుచరులు ఖమ్మం క్యాంప్ కార్యాలయానికి తరలివచ్చారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి బీజేపీ నేతలు వెళ్లాక రాత్రి తొమ్మిది గంటల వరకు పొంగులేటి క్యాంప్ కార్యాలయం వద్ద సందడి నెలకొంది. అన్ని నియోజకవర్గాల నుంచి ముఖ్య నేతలు, ఆయన అభ్యర్థులుగా ప్రకటించిన వారు క్యాంప్ కార్యాలయానికి చేరుకోగా.. శ్రీనివాస రెడ్డి, కృష్ణారావుతో బీజేపీ బృందం చర్చల సమయాన ఆసక్తిగా ఎదురుచూశారు. భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతగాని జైపాల్, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబుతో పాటు డాక్టర్ తెల్లం వెంకట్రావు, జాలె ఆదినారాయణ, విజయాబాయి, కోటా రాంబాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, స్వర్ణకుమారి కార్యాలయానికి వచ్చిన వారిలో ఉన్నారు.

జిల్లా సంక్షేమాధికారిగా సబిత



ఎం.సబిత

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ సంక్షేమాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న మహిళా, శిశు సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్.సంధ్యారాణికి డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. కాగా, ఖమ్మం ఏడీగా 2019లో నియమితులైన ఎం.సబితను మహబూబాబాద్ జిల్లా ఏడీ, జిల్లా సంక్షేమాధికారిగా 2020లో డిప్యూటేషన్‌పై నియమించారు. అక్కడ ఉన్న సంధ్యారాణిని డిప్యూటేషన్‌పై ఖమ్మం జిల్లాకు కేటాయించారు. 2020 అక్టోబర్ 1వ తేదీ నుంచి ఖమ్మం జిల్లా సంక్షేమాధికారిగా సంధ్యారాణి పూర్తి అదనపు బాధ్యతలతో విధులు నిర్వర్తిస్తున్నారు. పదోన్నతుల జాబితాలో సంధ్యారాణి, సబితకు స్థానం దక్కగా సంధ్యారాణిని కరీంనగర్‌కు కేటాయించారు. ఇక సబితను డిప్యూటీ డైరెక్టర్ హోదాలో భద్రాద్రి జిల్లా సంక్షేమాధికారిగా నియమించారు.కాగా, ఖమ్మం జిల్లా సంక్షేమాధికారిగా వచ్చేందుకు పలువురు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

అలరించిన రేలా పండుం



సంప్రదాయ నృత్యం చేస్తున్న ఆదివాసీలు

భద్రాచలంటౌన్: భద్రాచలం జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో టీఏజీఎస్ ఆధ్వర్యంలో జరుగుతు న్న ఆదివాసీ సాంస్కృతిక ఉత్సవాలు(రేలా పండుం) రెండో రోజు గురువారం ఉత్సాహంగా కొనసాగాయి. ఆదివాసీ యువతీ, యువకులు సంప్రదాయ ధూంధాం నృత్యాలు, కొమ్ము డ్యాన్స్‌లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు ఆటపాటలతో అలరించారు. ఆదివాసీ సాంస్కృతిక ఉత్సవాలను రెండో రోజు భద్రాచలం మాజీ ఎంపీ, టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాబూరావు ప్రారంభించి మాట్లాడారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని పేర్కొన్నారు. రేలా పండుంలో పాల్గొనేందుకు వచ్చిన ఆదివాసీ కళాకా రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి కొర్స భీమ్‌రావు, రాష్ట్ర నాయకులు బందారు రవికుమార్, మిసరం రాజు, పాయం రవివర్మ, సున్నం గంగా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఈ రమేశ్

పాల్వంచ: విద్యుత్ సిబ్బంది పనిచేసేప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎన్‌పీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.రమేశ్ సూచించారు. గురువారం సబ్ డివిజన్ కార్యాలయం వద్ద భద్రతా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పనిచేసేప్పుడు తగిన పనిముట్లను వాడాలని సూచించారు. రైతులు ప్రమాదాలకు గురి కాకుండా, మోటర్లు, స్టార్లర్లు ఎలా అమర్చుకోవాలో వివరించాలన్నారు. తొలుత వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారుల మురళి, లక్ష్మణ్, ఏఈ మధుబాబు, ప్రతాప్, రవీందర్, నరసింహారావు, సబ్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలి



హెచ్‌ఆర్ డైరెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పాల్వంచ: టీఎస్ జెన్‌కోలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని టీఆర్‌వీకేఎస్ నాయకులు కోరారు. గురువారం హైదరాబాద్‌లో జెన్‌కో డైరెక్టర్ (హెచ్‌ఆర్) అశోక్ కుమార్‌ను టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జాన్సన్, రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చారుగుండ్ల రమేశ్‌లు కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీటీపీఎస్ భూ నిర్వాసితులకు అర్హతలను బట్టి ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. జనరేటింగ్, హైడల్ స్టేషన్లలో పనిచేస్తున్న ఓఅండ్ఎం కార్మికులకు పదోన్నతులు ఇవ్వాలని, మెర్జ్ చేసిన పోస్టులను మళ్లీ రిలీజ్ చేయాలని కోరారు. నాయకులు పి.రాములు, అక్బర్, నవీన్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఈఈగా శ్రీనివాసాచార్యులు

ఇల్లెందురూరల్: ఇరిగేషన్ ఇల్లెందు డివిజన్ ఈఈగా శ్రీనివాసచార్యులు గురువారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది, అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో డీఈలు భాగ్యరాజ్‌రాథోడ్, రవికుమార్, శంకర్, కృష్ణ, ఏఈలు పాల్గొన్నారు.

చెస్‌లో గురుకుల విద్యార్థిని ప్రతిభ



రోషితను అభినందిస్తున్న అధ్యాపకులు, తోటి విద్యార్థినులు

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ గురుకులమ్స్ ఆల్ ఇండియా ఓపెన్ చెస్ పోటీల్లో అశ్వారావుపేట మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థిని ప్రతిభ చాటింది. 6వ తరగతి చదువుతున్న ఇంటి రోషిత ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన చెస్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించింది. విద్యార్థినికి మైనారిటీ గురుకులాల రాష్ట్ర సెక్రటరీ రోనాల్డ్ రోస్, నిర్వాహకులు ఆర్.చంద్రమౌళి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థినిని ప్రిన్సిపాల్ సంగీత రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

రెండు బైక్‌లు ఢీ : ముగ్గురికి తీవ్ర గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని మస్సివాగు గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలారం గ్రామపంచాయతీ భద్రుతండా గ్రామానికి చెందిన అజ్మీర రవి తన కుమార్తె నందినితో కలిసి బైక్‌పై ధర్మారం తండాకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో మస్సివాగు నుంచి రాజేష్ అనే యువకుడు ధర్మారం తండాకు మరో బైక్‌పై వెళుతున్నాడు. మూలమలుపు వద్ద రెండు బైక్‌లు ఢీకొనగా, ముగ్గురికి తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఖమ్మం తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ

టేకులపల్లి: ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న ప్రమాదం గురువారం జరిగింది. కొత్తగూడెం నుంచి మర్కోడుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, చింతోనిచెలక నుంచి కొత్తగూడెం వైపు వస్తున్న కారు కొత్తగుండ్లమడుగు పుణ్యపువాగు సమీపంలోని మూలమలుపు వద్ద ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కారు, బస్సు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. ప్రమాదంతో సుమారు గంటపాటు రాకపోకలకు అంతరాయం కలిగింది.

పైసా మే డిప్యూటేషన్?

పంపకాల్లో తేడాలు !

- ముదురుతున్న ఆశ్రమ పాఠశాలల డిప్యూటేషన్ వివాదం
- అధికారులు, హెచ్‌ఎంలకు పీఓ షోకాజ్ నోటీసులు
- గతేడాది జీసీసీలో రూ.కోటి ముష్టిగింజల కుంభకోణం
- ఐటీడీఏలో కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ



భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం

భద్రాచలం: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వార్డెన్ల డిప్యూటేషన్ల వివాదం ముదురుతోంది. కేవలం మౌఖిక ఆదేశాలతోనే డిప్యూటేషన్ల పర్వానికి తెరలేపిన ఐదుగురు అధికారులకు మొన్న షోకాజ్ నోటీసులు జారీ చేశారు. డిప్యూటేషన్లను రద్దు చేసిన ఉపాధ్యాయులను పాఠశాలల్లో చేర్చుకున్న, రిలీవ్ చేసిన ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు నిన్న ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు చార్జ్ మెమోలు జారీ చేశారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 180 మంది ఉపాధ్యాయుల అన్ని రకాల డిప్యూటేషన్లను డీడీ రమాదేవి రద్దు చేశారు. విద్యా సంవత్సరం ముగింపు రోజున తీసుకున్న ఈ నిర్ణయం తీసుకుకున్నారు. కాగా 180 మందిలో 38 మంది ఉపాధ్యాయులను కేవలం మౌఖిక ఆదేశాలతో డిప్యూటేషన్‌పై పంపించటం, ఆయా పాఠశాలల్లో చేర్చుకోవటం వివాదాస్పదంగా మారింది. దీంతో పీఓ ఆగ్రహం వ్యక్తం చేసి ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. విచారణకు త్రి సభ్య కమిటీ ఏర్పాటు చేశారు. ఆదేశాలు జారీ చేసిన అధికారులతో పాటు, ఉపాధ్యాయుల, ప్రధానోపాధ్యాయుల నుంచి త్రిసభ్యకమిటీ రాతపూర్వకంగా వివరణ తీసుకుంది. విచారణ సాగుతుండగానే డీడీ రమాదేవి, భద్రాచలం, దమ్మపేట ఏటీడబ్ల్యూవోలు నర్సింహారావు, చంద్రమోహన్, ఏసీఎంఓ రమణయ్య, అసిస్టెంట్ ఏసీఎంఓ భావ్‌సింగ్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కేవలం మౌఖిక ఆదేశాలతో డిప్యూటేషన్లకు పంపిన, మళ్లీ చేర్చుకున్న ప్రధానోపాధ్యాయులకు తాజాగా పీఓ గౌతమ్ పొట్రు ఆర్టికల్ చార్జ్ మెమోలను జారీ చేశారు. ఈ తతంగంపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

పెరిగిపోతున్న ఇంటి దొంగలు

జిల్లాల పునర్విభజన తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23 మండలాలు, ఖమ్మం జిల్లాలో 5 మండలాలు, ములుగు జిల్లాలో 2 మండలాలు, మహబూబాబాద్ జిల్లాలో 2 మండలాలు ఐటీడీఏ పరిధిలో కొనసాగుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపంతో ఐటీడీఏలోని పలు శాఖల్లో అవినీతి, అక్రమాలు పెరిగిపోతున్నాయని, అధికారులు, సిబ్బందే ఇంటి దొంగలుగా మారుతున్నారని విమర్శలు ఇటీవల వెల్లువెత్తుతున్నాయి. జీసీసీలో జరిగిన కోటి రూపాయాల ముష్టి గింజల కంభకోణమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు భద్రాచలం జీసీసీ బ్రాంచ్‌లో పనిచేస్తున్న శంకర్, దుమ్ముగూడెం మండలం నల్లబల్లి సేల్స్‌మెన్ వీరస్వామిలను సస్పెండ్ చేశారు. దమ్మపేటలో విధులు నిర్వహిస్తున్న సేతురామ్‌ను నర్సంపేటకు, భద్రాచలం జీసీసీ డీఎంగా పనిచేస్తున్న వాణిని హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. కేవలం క్రమశిక్షణా చర్యలతో సరిపెట్టిన అధికారులు సొమ్మును రికవరీ చేయటంలో విఫలమయ్యారు. ప్రస్తుతం గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో జరిగిన అక్రమ డిప్యూటేషన్లలో సైతం అవినీతి ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇతర శాఖల్లోనూ ఇంటి దొంగలు పెరిగిపోతున్నారని, ఐటీడీఏ ఉన్నతాధికారులు పర్యవేక్షణాలోపంతో పాటుగా క్షేత్రస్థాయిలో పర్యటనలు, పరిశీలన లేకపోవడంతోనే అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐటీడీఏలో గాడి తప్పుతున్న పాలనపై ఇప్పటికైనా పీఓ ప్రత్యేక దృష్టి సారించి క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

విద్యాసంవత్సరం చివరి రోజే ఎందుకు రద్దు చేశారు?

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల, వార్డెన్లకు సంబంధించి డిప్యూటేషన్లు ఈ ఏడాది కొత్తేమి కాదు. కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయుల సంఖ్యను, వారి దీర్ఘకాలిక సెలవులు, అవసరాలను బట్టి సర్దుబాటు చేసుకునే సౌలభ్యం ఆయా ప్రధానోపాధ్యాయులకు ఉంటుంది. దీనిని ఆసరాగా చేసుకొని అనేక మంది ఉపాధ్యాయులకు, వార్డెన్లకు వారి వ్యక్తిగత అవసరాలతో ఐటీడీఏ ఉన్నతాధికారులు డిప్యూటేషన్లను కేవలం మౌఖిక ఆదేశాలతో జరుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీని వెనుక భారీ స్థాయిలోనే ముడుపులు చేతులు మారాయనే ప్రచారం ఉంది. గతేడాది ఈ అవినీతి సొమ్ము పంపకాల్లో తేడాలు రావటం, కొందరికి చేరకపోవడంతోనే ఈ డిప్యూటేషన్ల రద్దు విద్యా సంవత్సరం ముగింపు రోజున తెర మీదకు వచ్చిందనే విమర్శలు ఉన్నాయి. ఏడాది పాటు చూస్తూ ఊరుకున్న ఉన్నతాధికారులు చివరి రోజు మేల్కొని హడావుడి చేస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోందని ఉపాధ్యాయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు పర్యవేక్షించినట్లయితే విద్యా సంవత్సరం ఆరంభంలోనే ఈ ఇంటి దొంగలు దొరికేవారని, తద్వారా గిరిజన విద్యార్థులకు న్యాయం జరిగి ఉండేదని పేర్కొంటున్నాయి.

పీఓకు నివేదిక ఇచ్చాం..

పీఓ ఆదేశాల మేరకు డిప్యూటేషన్ వ్యవహారంపై విచారణ చేపట్టాం. సుమారు 38 మంది మౌఖిక ఆదేశాలతోనే డిప్యూటేషన్‌పై వెళ్లినట్లు తేలగా, వారి నుంచి వివరణ తీసుకున్నాం. విచారణ నివేదికను అందించగా, పీఓ పరిశీలిస్తున్నారు.

– డేవిడ్ రాజ్, ఐటీడీఏ ఏపీఓ(జనరల్)

మెరుగైన సేవలు అందిస్తున్నాం..

పోస్టల్ సూపరింటెండెంట్ రవికుమార్



సబ్ పోస్టాఫీసును ప్రారంభిస్తున్న రవికుమార్

టేకులపల్లి: ఉమ్మడి జిల్లా ప్రజలకు పోస్టల్ శాఖ ద్వారా మెరుగైన సేవలందిస్తున్నట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా తపాలా శాఖ సూపరింటెండెంట్ బానోత్ రవికుమార్ తెలిపారు. గురువారం టేకులపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సబ్ పోస్టాఫీసును ఆయన ప్రారంభించి మాట్లాడారు. సబ్ పోస్టాఫీస్‌లో పొదుపు, ఇన్సూరెన్స్, డిపాజిట్లు, విత్‌డ్రా తదితర లావాదేవీలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పెన్షన్ , ఉపాధి హామీ డబ్బులు, ఇతర బ్యాంకుల్లోని డబ్బులు కూడా డ్రా చేసుకోవచ్చని తెలిపారు. టేకులపల్లికి ఇప్పటివరకు 507123గా పిన్ కోడ్ ఉందని, ఇక నుంచి 507127గా మారిందని తెలిపారు. తపాలా శాఖ మహిళల కోసం మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్(ఎంఎస్‌ఎస్‌సీ) పథకం ప్రవేశ పెట్టిందని, ఈ పథకం ద్వారా రూ.1000 నుంచి రూ.2లక్షల నగదు సేవింగ్స్ చేసుకోవచ్చని, రెండేళ్లలో మెచ్యూరిటీ అవుతుందని, 7.5 శాతం వడ్డీ లభిస్తుందని వివరించారు. తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్ అందించే పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకాలకు ఐటీ మినహాయింపు కూడా ఉందని తెలిపారు. దేవస్థానం బుకింగ్, చిన్న పిల్లలకు ఆధార్ నమోదు, ఆధార్‌లో మార్పులు, చేర్పులు అన్ని సదుపాయాలు పోస్టాఫీసులో అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్టాఫీస్ సూర్యదేవ్ వశిష్ఠ, సబ్ పోస్టుమాస్టర్ జే.ఉపేందర్ నాయక్, సర్పంచ్ బోడ సరిత, ఉప సర్పంచ్ కె.సురేష్, వార్డు సభ్యురాలు తోటకూరి చిట్టెమ్మ, సిబ్బంది ఎం.ఏ.హాషిమ్, ఆర్.శ్రీరాములు, జి.శ్రీను, జి.జానకీరామ్, డి.వెంకటాచారి, జి.నాగేశ్వర్‌రావు, బి.బాబూరావు పాల్గొన్నారు.

అంజన్న ఆలయానికి శంకుస్థాపన



పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ దంపతులు

టేకులపల్లి: మండల పరిధిలోని కోయగూడెంలో రూ.18 లక్షలతో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయానికి జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య, లక్ష్మి దంపతులు గురువారం శంకుస్థాపన చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అనంతరం ఎర్రాయిగూడెం గ్రామంలో ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పూజారి మిట్టపల్లి బలరాముడు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు చండీ హోమం

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు చండీ హోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమపూజలో పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రత్యేక శ్రద్ధతో సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా



దుమ్ముగూడెం: తూరుబాక డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న అధికారులు



భద్రాచలం అర్బన్: మాట్లాడుతున్న సందీప్ కుమార్ సుల్తానియా

భద్రాచలంఅర్బన్/దుమ్ముగూడెం: పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా ఆదేశించారు. గురువారం భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇతర ఉన్నతాధికారులు ఎం.హనుమంతరావు, ప్రదీప్ కుమార్ శెట్టితో కలిసి సమావేశం నిర్వహించారు. పట్టణంలోని జగదీష్ కాలనీలో ఉదయ గ్రూప్ మహిళలు ఎస్‌బీఐ రుణసాయంతో నెలకొల్పిన స్వీట్, కార యూనిట్‌ను సందర్శించి పరిశీలించారు. మహిళలు నెలకు రూ.లక్ష టర్నోవర్ సాధించడంపట్ల అభినందించారు. దుమ్ముగూడెం మండలంలోని తూరుబాక, నర్సాపురం, దుమ్ముగూడెం గ్రామపంచాయతీల్లో పల్లెప్రగతి పనులు, డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. గ్రామపంచాయతీ పనుల్లో ఎంపీహెచ్‌లు అలసత్వం చూపొద్దని చెప్పారు. పల్లెల్లో జరుగుతున్న పనులకు సంబంధించిన జీపీఎస్ లోకేషన్ ఫొటోలు 15 రోజుల్లో తనకు పంపించాలని ఆదేశించారు. ఐకేపీ ఏపీఎంలు, సీసీలు స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా వ్యాపించకుండా పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని చెప్పారు. ఎం.హనుమంతరావు మాట్లాడుతూ అశ్వారావుపేట, అశ్వాపురం, టేకులపల్లి మండలాల్లోని వైకుంఠధామాల్లో విద్యుత్, నీటి సౌకర్యం లేదని తమ దృష్టికి వచ్చిందని, ఆ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, సోలార్ విద్యుత్ కనెక్షన్ అయినా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి మండలంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలన్నారు.

ఇంటి పన్ను పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. గ్రామాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని సుల్తానియా పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 2.68 లక్షల పంచాయతీల్లో 46 గ్రామ పంచాయతీలకు జాతీయస్థాయి అవార్డులు వచ్చాయని, వాటిలో తెలంగాణ రాష్ట్రంలో 13 పంచాయతీలు ఉండటం అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల్లో ప్రశ్నించేతత్వం వచ్చినప్పుడే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. తూరుబాక పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం జిల్లాలో పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై కలెక్టర్ అనుదీప్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో టూరిజం మేనేజింగ్ డైరెక్టర్ మనోహర్, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీపీఓ రమాకాంత్, డీఆర్‌డీఓ మధుసూదన్‌రావు, భద్రాచలం ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, దుమ్ముగూడెం తహసీల్దార్ ప్రతాప్, ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, సర్పంచ్ భూక్యా చంద్, ఎంపీటీసీ నూప నాగలక్ష్మి, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఐకేపీ ఏపీఎంలు, ఈజీఎస్ ఏపీఓలు, సీసీలు, గ్రామపంచాయతీ సెక్రటరీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. సీఐ దోమల రమేష్, ఎస్‌ఐలు రవికుమార్, నర్సిరెడ్డి బందోబస్తు నిర్వహించారు.

విదేశీ యూనివర్సిటీల్లో గిరిజన విద్యార్థులకు సీట్లు

అక్కడకు వెళ్లే స్థోమత లేక దాతల చేయూతకు వినతి



క్రాంతినాయక్ సిద్దు అలెగ్జాండర్

పాల్వంచరూరల్: ఇంటర్ పూర్తిచేసిన ముగ్గురు గిరిజన విద్యార్థులకు అమెరికాలో ఉన్నత చదువుల కోసం సీట్లు లభించాయి. కానీ అక్కడికి వెళ్లే స్థోమత లేక వారు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. పాల్వంచ మండలంలోని లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరుకు గుగులోతు క్రాంతినాయక్, కొణిజర్ల మండలం చిన్నమునగాలకు చెందిన కాంపెల్లి సిద్దు, సత్తుపలికి అంబేద్కర్ నగర్‌కు చెందిన సిద్దార్ధ అలెగ్జాండర్ తాజాగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తిచేశారు. వీరు శాట్స్ పరీక్ష రాయగా అమెరికాలోకి వివిధ యూనివర్సిటీల్లో సీఎస్ఈ కోర్సు చదివేందుకు సీట్లు లభించాయి. కానీ అక్కడి వెళ్లి చదువుకోవాలంటే ఒక్కో విద్యార్థికి రూ.25లక్షలపైగానే ఖర్చవుతుంది. దీంతో అంత స్థోమత లేని వారు ప్రభుత్వం, దాతలు చేయూత కోసం ఎదురుచూస్తున్నారు. కాగా, దాతలు సహకరిస్తే గిరిజన విద్యార్థులు విదేశాల్లో చదువుకునే అవకాశం లభిస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు.

నేటి నుంచి పామాయిల్ గెలల స్వీకరణ

అశ్వారావుపేటరూరల్: పామాయిల్ ఫ్యాక్టరీకి శుక్రవారం నుంచి పామాయిల్ గెలలు తీసుకురావొచ్చని ఆయిల్ ఫెడ్ సీనియర్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, డివిజనల్ మేనేజర్ బాల్యకృష్ణ తెలిపారు. ఫ్యాక్టరీలో వార్షిక నిర్వహణ పనులు పూర్తి కావడంతో క్రషింగ్ తిరిగి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

చట్టసభల్లో మహిళలకు ప్రాధాన్యమివ్వాలి

సుజాతనగర్: చట్టసభల్లో మహిళలకు అధిక ప్రాధాన్యమివ్వాలని సామాజిక కార్యకర్త దేవి పేర్కొన్నారు. గురువారం సుజాతనగర్ మాజీ సర్పంచ్ కాసాని లక్ష్మి వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రావిచెట్టు సెంటర్‌లో జరిగిన బహిరంగసభలో దేవి మాట్లాడుతూ ఉద్యమాలు నడిపే సత్తా మహిళలకు కూడా ఉందని ఈ ప్రాంత వాసులకు కాసాని లక్ష్మి తెలియజేసిందని కొనియాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, సీపీఎం నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, కాసాని ఐలయ్య, మండల కార్యదర్శి వీర్ల రమేష్, కొండపల్లి శ్రీధర్, ఆయా పార్టీల నాయకులు నాగా సీతారాములు, చింతలపూడి రాజశేఖర్, మండె వీర హనుమంతరావు, బత్తుల వీరయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం మళ్లీ వాయిదా



ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ సాధారణ సమావేశం మరోమారు వాయిదా పడింది. సమావేశం నిర్వహించేందుకు 67 అంశాలతో కూడిన ఎజెండాను రూపొందించి కౌన్సిల్ సభ్యులకు మంగళవారం అందజేశారు. అధికార బీఆర్‌ఎస్‌లోని అసమ్మతి కౌన్సిలర్లు ఎమ్మెల్యేపై ఒత్తిడి తేవడమే గురువారం జరగాల్సిన సమావేశం వాయిదాకు కారణంగా తెలుస్తోంది. కాగా సమావేశం ఈ నెల 6న నిర్వహించాలని నిర్ణయించారు. కొంతకాలంగా ఇల్లెందు మున్సిపల్ పాలకవర్గంలో అసమ్మతి నెలకొన్న విషయం విదితమే. గత ఫిబ్రవరిలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై కలెక్టర్‌కు అవిశ్వాస నోటీస్ అందజేశారు. అప్పటి నుంచి విబేధాలు తారాస్థాయికి చేరాయి. అధికారపక్షంలోని మెజారిటీ సమస్యలు అసమ్మతి వ్యక్తం చేస్తూ సమావేశానికి రాకపోవడంతో కోరం సరిపోక కౌన్సిల్ సమావేశాలు జరిగే పరిస్థితి లేదు. మరోవైపు అసమ్మతి కౌన్సిలర్లు పెడుతున్న కండీషన్లను చైర్మన్, ఆయన బృందం ఒప్పుకోవడం లేదు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఎమ్మెల్యే హరిప్రియ తన క్యాంపు కార్యాలయంలో ఇరువర్గాలతో సమావేశమయ్యారు. రాత్రి వరకు చర్చలు సాగుతూనే ఉన్నాయి. రెండు వర్గాలు ఏకాభిప్రాయానికి వస్తాయా? ఈ నెల 6న మళ్లీ మున్సిపల్ సాధారణ సమావేశం జరుగుతుందా? అనేది వేచి చూడాల్సిందే.

నలుగురికి పదేళ్ల జైలుశిక్ష

కొత్తగూడెంటౌన్: గంజాయి రవాణా కేసులో నలుగురు నిందితులకు పదేళ్ల చొప్పున కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.లక్ష జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి(స్పెషల్ జడ్జి ఎన్.డీ.పీ.ఎస్ యాక్ట్) ఎం.శ్యాంశ్రీ గురువారం తీర్పు చెప్పారు. తీర్పు వివరాలిలా ఉన్నాయి. 2018, అక్టోబర్ 28న భద్రాచలం పోలీసులు సీఆర్‌పీఎఫ్ క్యాంప్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కుంట నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ డిపో బస్సులో ఏడుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. తనిఖీ చేయగా వారి వద్ద రూ.3.45 లక్షల విలువైన 69 కిలోల గంజాయి లభ్యమైంది. వీరు ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరికి చెందిన గోపాల్ మండల్, దీపాంకర్ యస్‌నామా, సంతోష్ సర్కార్, సమూలి ముండా, హైదరాబాద్‌కు చెందిన అలీఖాన్, రాజీవ్‌కుమార్ పటేల్, పులిమెట్ల చింతంగపల్లికి చెందిన స్వామి సర్కార్‌గా విచారణలో తేలింది. గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు నేరం ఒప్పుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. వీరిలో రాజీవ్‌కుమార్ పటేల్‌కు 2023, ఫిబ్రవరి 18న కోర్టు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించింది. గురువారం గోపాల్‌మండల్, దీపాంకర్, సంతోష్ సర్కార్, సమూలి ముండల్‌కు అదే శిక్ష విధించగా, ఇంకో ఇద్దరు పరారీలో ఉండగా వారెంట్ జారీ చేశారు.